

# యజ్ఞం – శేషచంద్ర

## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో సాధారణ బహుమతి పొందిన నవల

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**మండలాఫీసు** ఆవరణలోనే పోలీసు స్టేషన్ ఉండటంతో డిప్యూటి తహశిల్దారు ఫోన్ చేసిన కొద్ది సేపటికి ఇద్దరు హోం గార్డులు లాఠీలూపుకొంటు ఆఫీసులోకి వచ్చారు. వచ్చిన వెంటనే అక్కడున్న జనాల మీద తమ ప్రతాపం చూపిస్తూ "ఏం పని ఇంత మంది గుంపుండారు అంతా బైటికి పదండి అంటూ లాఠీలను ఝులిపిస్తూ అందర్ని బైటకి తరిమి, డిప్యూటి తహశిల్దారు దగ్గరికి వచ్చి సెల్యుట్ చేస్తూ" ఎవరు సార్ గొడవ చేసేది ఏం కావాలంట వాడికి " అన్నాడు వాళ్లలో ఒకడు.

క్లర్కును డబ్బు ఇవ్వమని నిలదీస్తున్న రుద్రను చూపుతూ. " అదిగో వాడే " అన్నాడు డిప్యూటి తహశిల్దారు.

పోలీసులను చూడగానే ధైర్యం తెచ్చుకొంటూ " అక్కడికి పో.. వాళ్ళిస్తారు నీకు ఇయ్యాల్సినంతా " అన్నాడు క్లర్క్ వెటకారం చేస్తూ రుద్రతో.

వెనక్కి తిరిగి చూచిన రుద్రతో , " ఏయ్ ఏంది గొడవ ఏ ఊరు నీది. రా ఇట్రా" అన్నాడు వాళ్లలలో ఒక పోలీసు.

రుద్ర అక్కడ్నుంచి కదలకుండా కానిస్టేబులు వంక చూస్తూ" నేనిక్కడ ఏ గొడవ సేయడం లేదే " అన్నాడు.

" పిలుస్తుంటే ఆక్కడే నిల్చున్నావ్ పెద్ద పోతుమొగోడిలాగ . గొడవ చేయకపోతే అక్కడేం పని పోతురా బైటికి."

"నాకు డబ్బులు రావాలి అడుగుతున్నా " అన్నాడు అక్కడ్నుంచి కదలకుండానే ఏ మాత్రం తొణక్కుండా . దాంతో పోలీసుకు కోపం వచ్చింది. తను వేసుకొన్న ఖాకీ బట్టలకు అవమానం కలిగినట్లుగా ఫీలవుతూ ,

" ఏం డబ్బులివ్వాల నీకు . పిలుస్తుంటే అక్కడే నిల్చున్నావ్ కదలకుండా . రా ఇట్లా " అంటూ గట్టిగా అరిచాడు. పక్కనే ఉన్న మరొకడు రుద్ర దగ్గరికి పోయి కాలర్ పట్టుకొని లాగబోతూ . రుద్ర కొపంగా చూసే సరికి అతని ఆకారం వేసుకొన్న బట్టలు చూసి జంకి ఎత్తిన చేయి దించేసాడు.

“ డిటి ఫోన్ చేయగానే పరిగెత్తుకొచ్చారు. ఏంది ఏమి జరిగినాదని తెలుసుకొకుండానే నా పైనా చేయి ఏయాలని చూస్తుండావ్ . నేనేమన్నా ఎవర్నిన్నా కొట్టినానా తిట్టినాన వీళ్లు లంచం తీసుకొనింద్రు ఆడబ్బులు ఎనిక్కి ఇయ్యమంటుండా. ఇప్పించు మళ్లా . “ అన్నాడు రుద్ర .

. “ ఏంది నోరు లేస్తాండాది . రూల్స్ మాట్లాడుతుండావా పదరా ముందు స్టేషన్కు“ అన్నాడు రెండవ వాడు కూడా రుద్ర దగ్గిరికి వస్తూ .

“ ఎవర్రా నీకు అరే ఖాకి డ్రస్సు ఏసుకొంటానే కళ్లు నెత్తికెక్కుతాయా . నువ్వు పోలీసైతే ఎవర్నో పిట్ పాకెట్ గాన్ని దొంగను పిలిచినట్లు అరే అని పిలిచి నా కాలరు పట్టుకోవాలని సూస్తావా . ఎమనుకొంటుండావ్ . పిచ్చి పిచ్చి వేషాలేస్తే. ఉద్యోగాలు పోగొట్టుకొని ఊచలు లెక్కపెట్టలా .అసలు మిమ్మల్ని ఎవరు పంపించింద్రు ఈడికి . నేనేం సేసామని నన్ను స్టేషన్కు రమ్మంటుడారు. అరెస్టు వారెంటు ఉందా మీ కాడా. వీళ్లిద్దరు లంచం తీసుకొనింద్రు. రమ్మను వాళ్లను కూడా నాతో పాటు స్టేషన్కు నేను వస్తా .మీ సార్ అరవింద్ కాడ్నే తేల్చుకొంటాం . కనుక్కోండి మీ సారును ఆయన ఈడికి వస్తాడో మమ్మల్ని ఆడికి రమ్మాంటాడో . “

తమ ఖాకి దుస్తులు చూసి భయపడి పోతాడనుకొని వచ్చిన ఆ పోలీసులిద్దరికి చెమటలు పట్టాయి. ఏదో మామూలోడు గట్టిగా దబాయించి బైటికి పంపాలనుకొన్నారు. సిఐ పేరు చెప్పి మాట్లాడే సరికి మాటలు పెగల్లేదు వాళ్లకు. అంత ధైర్యంగా మాట్లాడుతున్నాడంటే అతని వెనక ఎవరో ఉండి ఉంటారని లేక పోతే అంత ధైర్యంగా మాట్లాడలేదని తమకెందుకు గొడవ అని ఆలోచన్లో పడ్డారు.

“ ఏం పలకవు ఫోన్ నువ్వు సేస్తావా లేక నన్నుసేయమంటావా . “ అని రెట్టించాడు రుద్ర.

రుద్ర వాళ్లతో తిరగ బడి ఏ మాత్రం భయపడకుండా మాట్లాడుతున్న తీరు చూసి డిప్యూటి తహశిల్దారు, క్లర్కులకు గుబులు మొదలైంది. తాము డబ్బులు తీసుకొని తప్పు చేసామోమో నని చిన్నపాటి భయం మొదలైంది. ప్రెస్ మీడియా వాళ్లు వస్తే నానా గందరగోళం అయి ఎక్కడ ఎత్తి పోసుకోవాల్సి వస్తుందో నని . వెంటనే పరమేశాన్ని పక్కకు పిలిచి తాను, క్లర్కు తీసుకొన్న డబ్బులు తిరిగి ఇచ్చేసి “ క్లర్కు దగ్గర నేను తర్వాత తీసుకొంటాలే ఇప్పుడు అందరి ముందు వాడు తిరిగి ఇస్తే బాగుండదు “ అన్నాడు. పరమేశం వచ్చి రుద్రకు డిటి ఇచ్చిన డబ్బులు చూపిస్తూ“ డబ్బులు ముట్టినాయి బ్రదర్ ఇక పోదాం పద“ అంటూ రుద్రను భుజం మీద చేయి వేసి పిలుచుకపోయాడు పక్కకు. హోం గార్డులిద్దరు రుద్ర వైపు అదోలా చూస్తూ వెళ్లిపోయారు.

రుద్ర పోగానే ఊపిరి పీల్చుకొన్నాడు డిప్యూటి తహశిల్దారు. అతని సర్వీసులో ఈలా జరగడం మొదటి సారి. కొండయ్య ఫైలు తీసి తప్పులు పట్టేందుకు అవకాశముందేమో చూడసాగాడు. తప్పులేమి లేకున్నా అడ్డం పెట్టి పని ఆపేందుకు ధైర్యంచాల్లేదు డిటికి. అదేదో తహశిల్దారే చూసుకొంటాడని గబ గబా సంతకాలు చేసి తహశిల్దారు టేబులు మీదికి పంపించేసాడు. రుద్ర అక్కడుంటే ఇంకా అక్కడ ఏం గొడవలు జరుగుతాయో నని. కొండయ్య “ ఇక నువ్వు పోతే

రుద్రా పని జరిగిపోతాదిలే " అన్నాడు. అక్కడ కొండయ్య తో పాటు అతనిలాగే పడిగాపులు కాస్తున్న మిగతా వాళ్ల పరిస్థితి చూసి జాలేసింది రుద్రకు. ఇంకొద్దిసేపు అక్కడే ఉండాలనుకొని కొండయ్యను భోజనానికి పిలుచుకపోయి తనూ తిని వస్తూ వస్తూ కొన్ని అన్నం పాకెట్లు కట్టించుకొచ్చాడు. ఆకలికి నక నక లాడుతూ ఆఫీసు వరండాలో కడుపు మాడ్చుకొంటున్న వాళ్లకు పంచాడు వాటిని. ఇంకా కొంత మంది మిగిలితే పోయి తిని రమ్మని డబ్బులిచ్చాడు. ఒక్కసారిగా ఆఫీసు మెట్లక్కని రుద్రకు ఒక్కసారిగా గుర్తింపు వచ్చింది .

సాయంత్రం కొండయ్య పని అయినంత వరకు అక్కడే ఉన్న రుద్ర ఆఫీసులో జరిగే పని తీరు చూస్తుండి పోయాడు. అది ప్రభుత్వ కార్యాలయంలా కనిపించలేదు. ఏదో పెద్ద అంగడిలా కనిపించింది. ఒకరిద్దరు దళారిలు తమకు ఆఫీసులో అంతా తెలుసు అని అధికారులదగ్గిరికి పోలేని వాళ్ల దగ్గర డబ్బులు తీసుకొంటూ కొంత జేబుల్లో వేసుకొని మిగతాది ఆఫీసులో ఇచ్చి పనులు చేయించడం కనపడింది. ఆఫీసులో రుద్ర వాదులాడటం చూసిన కొందరు సర్వేయరు తమ పనులు చేయడం లేదని రుద్రకు చెప్పుకొన్నారు. ఆ సమయానికి సర్వేయరు మళ్లీ క్యాంపు పోయి ఉండటంతో వాళ్ల మాటలు వినడంతప్ప ఏమి చేయలేక పోయాడు రుద్ర. లేకుంటే మరోసారి గొడవ జరిగిండేది ఆఫీసులో.

జరిగిన సంఘటన మరిచిపోలేదు రుద్ర. దాని చుట్టే అతని ఆలోచనలు ముసురుకోసాగాయి. పనులు సరిగా చేయక పోగా నిర్లక్ష్యం ఆఫీసులో వాళ్లు వ్యవహరిస్తున్న తీరు బలైపోతున్న సామాన్యప్రజలు అతనికి పదే పదే గుర్తుకు రాసాగారు. ఆఫీసులో పనులు సరిగా జరిగేలా చూడలనుకొన్నాడు. అనుకోవడమే కాదు దాన్ని అనుసరించేందుకు తన మిత్రలనందర్ని ఎప్పుడు కలుసుకొనే ఊరవతల చింతతోపు దగ్గిరికి రమ్మనాడు. జరిగిన గొడవ గురించి అంతా చెప్పి " మీకేమనిపిస్తాండాది రా " అడిగాడు.

చెప్పిందంతా ఆసక్తిగా విన్నారు వాళ్లు. అందరికన్నా ముందు బికారే నోరు విప్పాడు. ఏలాంటి మొహమాటం లేకుండా ,

" నువ్వు సేసిన పనే బాగలేదనిపిస్తాండాది నాకు. ఆరై తన చేతినుంచే డబ్బులిచ్చి పనిచేయించి పనైపోతాదన్నాక నువ్వు ఆఫీసోళ్లతో తగులాడటమేంది. లంచాలు తీస్కోని పని సేయడం మామూలే గదా అదేం కొత్తకాదే నువు దానికోసం తగులాడి పోలీసుల్దాక తెచ్చుకోవడమేంది. " అన్నాడు.

మిగతా వాళ్ల వైపు చూచాడు రుద్ర. వాళ్లు కూడా బికారినే సమర్దిస్తున్నట్లు మాట్లడటంతో" నేను చేసినేది మీక తప్పనిపిస్తాండేదేమో కాని నాకు తప్పనిపించడంలే. అంతే గాదు నేనీ పని కంటిన్యూ చేయాలనుకొంటాన్నా. " అన్నాడు.

" అంటే ప్రతోడి కోసం నువ్వు ఆఫీసోళ్లతో తగులాడాలనుకొంటుండావా " అన్నాడు పూజారి. ఆశ్చర్యపోతూ !

" అవును . "

మార్కెటు యార్డు చేర్మన్ ఎంకట్రెడ్డి ఒక్కగానొక్క కొడుకు రుద్ర. ఎంకట్రెడ్డి వెంకటా పురం గ్రామంలోనే కాదు మండలంలోనే పెద్ద మోతుబరి రైతు . కల్మషం లేని మనిషి. ఉన్నది ఉన్నట్లు మాట్లాడే రకం. అందువల్లే పాతిక సంవత్సరాలుగా రాజకీయల్లో ఉన్నా మార్కెటు యార్డు చేర్మన్ కే పరిమితమయ్యాడు. అందరు రాజకీయనాయకుడు లాంటి వాడు కాదు. ప్రజలకు మంచి చేయాలన్న తపన ఉన్న వాడు. డబ్బుకోసం అడ్డదారులు తొక్కే తత్వంకాదతనిది. అతని భార్య సావిత్రమ్మ అంటుంటుంది నీ లాంటి వాడు రాజకీయాలకు పనికి రాడని. రుద్రకు రాజకీయలంటే పడదు. ముక్కు సూటి మనిషి. చిన్నతనం నుండి తన ఎదురుగా ఏదైనా అన్యాయం జరిగితే చూస్తూ ఉండే వాడుకాదు. స్కూల్లోను కాలేజిలోను అంతే . రుద్ర చేసే పనులు వల్ల ప్రతిచోట ఓ గుంపు ఓ గుర్తింపు ఉంది. రుద్రకు చిన్న నాటి స్నేహితులు పూజరి,బికారి, జార్జి, జాఫర్, స్వామిలు . అందరు మండలంలో నే డిగ్రీలు సేసి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నారు. రుద్ర హైదరా బాదులో బిటెక్ చేసి పెద్ద కంపిణీలో జాబ్ చేస్తూనే సివిల్స్లో పాసై మెయిన్ ఇంటర్వ్యూలులతో పాటు ట్రైనింగ్ కూడా పూర్తి చేసుకొని ఐపిఎస్ క్యాడర్లో పోస్టింగ్ రావల్సి**ఉండగా** కొంత మంది కోర్టుకు పోవడం తో పోస్టింగ్స్ ఆగిపోవడంతో కోర్టుతీర్పుకోసం ఎదురు చూస్తున్నాడు. రుద్రతో కలిసి మిగతా అయిదు మంది మిత్రులు వెంకటాపురాన్ని ఒక రకంగా ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దారు. రుద్ర దూరంగా బైట ఉన్నా ప్రతి వారం వెంకటాపురుం వచ్చే వాడు మిత్రులతో కలిసి పనిచేసే వాడు. వాళ్లను చూచి గ్రామంలో మిగతా ప్రజలు తలా ఓచేయి వేయడంతో ఆ గ్రామం ఆదర్శగ్రామంగా నిలిచింది.

రుద్ర స్థిరంగా తన నిర్ణయం చెప్పేసరికి ,

“ ఉన్నట్టుండి నీకీఆలోచన ఎందుకొచ్చిందిరా “ అన్నాడు పూజారి .

“ మండలాఫీసులో వాళ్లు సేసే పనులు సూసినాక ఒక్కొక్కడ్ని నరికి పోగుల పెట్టాలనిపిస్తుండాది. ఎంత నిర్లక్ష్యంగా ఉండాది వాళ్లకి . ఆఫీసు వోళ్ల సొంత కార్ఖానా అనుకొంటుండారు. వోల్ల వల్ల ఎంత మంది బీదోళ్లు పనులు కాక ఇబ్బంది పడ్తుండారు. కడుపులు మాడ్చుకొని లంచాలిచ్చి పనులు సేయించుకొంటుండారు. ఎక్కడోడో ఊరుగాని ఊర్నుంచి వచ్చినోడయిన ఆర్డై , కొండయ్య మావ ఆఫీసు సుట్టు తిరగుతుండేది సూసి బాధ పడి తను పనిసేయడమే కాకుండా తన సొంత డబ్బిచ్చి పని జరిగేలా సూసిండు. అది చూసినాక నాకు మనమెందుకు గమ్మనుండాలనిపించినాది. మనం రంగంలోకి దిగి మనోళ్లకు ఎందుకు సహాయం సేయకూడదనిపిస్తుండాది.” అన్నాడు రుద్ర ఆవేశంగా.

“ నువ్వు ఆవేశంలో ఉండావురా. అందుకే ఈ విషయం సానా సింపులుగా అనిపిస్తుండాది. నిదానంగా ఆలోచించి సూడు . ఇదేం టాగూరు సిన్మాకాదు. లంచగొండుల్ను అవినీతి సేసేటోళ్లను పట్టుకొనేకి పెద్ద యంత్రాంగమే ఉండాది. అయినా ఏమి సేయలేక పోతుండారు. ఏదో కొండయ్య మావ విషయంలో నువ్వు అడ్డం తిరిగినా నీ టైము బాగుండాది కాబట్టి ఏదో జరిగి పోయినాది. అయినా కొండయ్యమావ పని సగమైపోయినాక నువ్వు గొడవ పెట్టుకొన్నవు.

కాని పని కాక ముందే గొడవ పెట్టుకొనింటే వాళ్లుపనిచేయకుండా లేని పోని తప్పులు పట్టి సుక్కలు సూపేటోళ్లు " అన్నాడు బికారి.

" వోళ్లు సుక్కలు సూపిస్తే వదిలే వోన్ని కాదు. ఏం సేయాలో అది సేసేటోన్ని . సిన్మాలో ఇట్టాటి సీన్లు సూస్తే సప్పట్లుకొడ్తరు . బైట సేయాలంటే వెదవ లాజిక్కులు సెప్తరు. అయినా మనమేం సిన్మాలోలాగా ఫైటింగులు సేసేదానికి పోవడంలా ఎవరికి ఏ పని జరగడం లేదో ,యాడ పెడింగ్ ఉండాదో, ఎందుకు పెడ్డింగ్ ఉండాదో , ఎందుకు పని సేయరో తెలుసుకోని నిలదీయపోతుండాం. అట్టా మనమొకసారి ఎదురు తిరగడం నేర్పితే సానా మంది అట్టాగా నిలదీయడం అలవాటైతాది . సానా మందికి ఇట్టా ఎదిరియ్యాలని ఉంటాది గాని దయిర్నమే ఉండదు. అది మనం కలిగించాల "

"నిన్ను ఎగతాళి సేయాలని గాదురా . కాని ఈ గోల మనకేలని . గ్రామంలో సేసే పనులకే ఇంట్లో వోళ్లు బైట బేవర్సగా తిరుగుతూ లేని గొడవలు తెస్తుండారని ఒకటే రదన దానికితోడు ఇదొకటి నెత్తికెత్తుకొంటే ఇంగేంలా కొంపల్లో ఉండలేం. " అన్నాడు బికారి.

" అవున్రా బికారి గాడు చెప్పినేది నిజమే . గ్రామంలో మనం సేసే పనికి, ఇప్పుడు మండల లెవల్లో సేసేదానికి సానా తేడా ఉంటాది . నీకు జరిగిం దానికే సూడు ఆపోలీసోడు కొద్దిగా షార్ట్ టెంపరున్నడైతే ఏం జరిగుండేది . వోడు నీ మీద సేయి వేసేవోడు ఆవేసంలో నువ్వు తిరగబడే వోడివి. సిఐ అరవింద్ నీ ఫ్రెండు కాబట్టి ఒకేల స్టేషన్కు పోయినా ఏమి కాదనుకో కాని మీద పడ్డ దెబ్బ మళ్లా తిరిగి వస్తాదా. పోలీసోడిమీద తిరగబడితే ఎట్టా ఉంటాదో నీకు నేను సెప్పాలా సిఐ ఎంతకాలముంటడు. పోలీసోళ్లకు నువ్వు తిరగబడినేది మనసులోనే ఉండనే ఉంటది . మీ నాయన పొలిటకల్ పవరున్నా సమయం కోసరం కాసుకొని ఉంటారా నాయాళ్లు. లేని పోని సమస్యలు . ఇయ్యన్ని మనకవసరమా . మొదలెడితే ఎటొచ్చి యాడికి పోతాదో ఏమో. " అన్నాడు జాఫర్ .

"అవున్రా . ఇయేమి పట్టించుకోమాకు. రేపో మాపో ఉద్యోగం రాబోతుండాది. అప్పుడు సహాయం సేయి అన్నాయం జరిగేటోళ్లకు. ఇప్పుడెందుకీనీకెందుకియ్యన్ని.". అన్నాడు బికారి . రుద్ర నిర్ణయాన్ని మానుకోమని చెప్తూ . మిగతా వాళ్లు బికారికి బలకొట్టారు. చాలా సేపు తర్జన బర్జనలు జరిగాయి. రుద్ర తన నిర్ణయంలో మార్పులేదని తెగేసి చెప్పేసాడు.

".లేదురా మీరెన్ని చెప్పినా నేనో నిశ్చయానికి వచ్చాను. అనుకొన్నది చేసి తీర్తాను . మీరు నా వెంట వచ్చినా రాకపోయినా. అంతేకాదు. అంతదాక ఉద్యోగం వచ్చినా సరే పోయేదిలేదు. ఇదేదో కోపంలో అనే మాట కాదు ఆలోసించే సెప్తుండా ".అన్నాడు రుద్ర స్దిరంగా.

అందరు అవాక్కయ్యారు. రుద్ర దాన్ని అంత సీరియస్గా తీసుకొంటాడని ఊహించలేదు వాళ్లు. " ఏందిరా నీగ్గాని తిక్కగాని పుట్టిందా . బంగారంలాంటి పోలీసాఫీసరుద్యోగం దీనికోసరం వదులు కొంటావా " అన్నాడు జార్జి..

"అవును నేను ఉద్యోగం చేయాలనుకొన్నది డబ్బుల కోసమో , అధికారం కోసం కాదు. ప్రజలకు ఏదో విధంగా ఉపయోగ పడాలని . అదేదో ఎక్కడోళ్లకు చేసే బదులు మనోళ్లకే మంచి జరిగేలా సూస్తా .అది సేసినాకనే ఇప్పుడు వచ్చిన ఉద్యోగం ఉంటే జేర్తా లేదంటే మళ్లీ పరీక్షలు రాస్తా ఉద్యోగం సంపాదిస్తా. "

అయిదు మంది మౌనంగా ఉండిపోయారు. వాళ్ల ముఖాల్లో కనిపిస్తున్న ఆందోళన ఎటు నిర్ణయించుకోలేని సందిగ్ధతను చూస్తూ".మిమ్మల్ని ఇబ్బంది పెట్టాలనుకోవడంలేదు. మీ ఆలోచన్లు మీయి. మీ సమస్యలు మీయి. అందరు ఒకేలా ఆలోచించాలని యాడుండాది. ఏదో గ్రామంలో కలిసి పనిసేస్తున్నారని మీకు నాలా సేయాలని ఉంటాదేమో నని విషయం చెప్పానంతే. మీకిష్టమైతేనే నాతో చేతులు కలపొచ్చు లేకపోతే లేదు. ".

అయిదు మంది ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయారు.

సూర్యుడు చెరువులో జలకమాడ్తుంటే , గట్టు పక్కన దడి కట్టినట్లు నిల్చున్నాయి చెట్లు వరసగా . ఆ పక్కనే ఉన్న పంట కోసిన బీడు చేలల్లో పెరిగిన గడ్డి మీద చిన్న చిన్న మిడతలు ఇతర పురుగులు ఉత్సాహంగా ఎగిరి గంతులేస్తున్నాయి. బలహీనుడికి సంతోషపడే అదృష్టం లేనట్లు, వాటి పక్కనే నిల్చుని జపం చేస్తున్న కొంగలు రాకెటు వేగంతో కదిలి వాటిని నోట కరుచుకొంటున్నాయి.

చల్లని గాలి గిలిగింతలు పెడుతుంటే ,చెప్పులు చేత పట్టుకొని పొలం గట్ల మీద మొలచిన పచ్చటి గడ్డి మీద నడుస్తుంటే ఎంతో హాయి అనిపించసాగింది రుద్రకు .

"ఎంత ప్రశాంతంగా ఉండాది. రెండు మూడు తరాలు పోతే ఈ వాతవరణముండదేమో . అభివృద్ధి పేరుతో ఒక పక్క పచ్చని పొలాలు, చెట్లను నాశనం చేసి ప్యాక్టరీలు మయం చేస్తూ . మరో పక్క పెరిగిన ట్రాఫిక్ కోసరమని నాల్గు రోడ్లు ఎనిమిది రోడ్లు బై పాసులు అంటూ రోడ్డు పక్కన ఉన్న పెద్ద పెద్ద చెట్లు కూల్చేస్తుపోతుండారు. అభివృద్ధి జరగలా , రోడ్లు కావాలా బాగానే ఉండాది కాని రోడ్ల కోసరం స్థలం తీసుకొనేప్పుడే ఇంకా కాస్తా స్థలం తీసుకొని చెట్లు నాటించి వోటిని బ్రతికించేలా సేస్తే సరిపోతాది. కాని అది ఎవరికుండాది . ఎంత సేపు తన ఉచిత పథకాలతో తప పదవులు కాపాడుకోను తమ స్వంత డబ్బు ఖర్చు పెట్టాండా మన్నట్టు ప్రభుత్వం సొమ్ము ఖర్చు పెడ్తు ఎవరు అధికారంలోకి వస్తే ఆ అన్న పేరు పెట్టుకోవడంతోనే సరిపోతాండాది. రోజు పేపరు నిండా ఫోటోలు నింపుకోడంతోనే సరిపోతాండాది. భావితరాలకు ఉపయోగ పడే శాశ్వత పథకాలు చేయాలని కలలోకూడా అనుకోవడంలేదు. " అనుకొంటూ బోరు దగ్గరికి వచ్చాడు రుద్ర.

అక్కడ ఎంకట్రెడ్డి మోటార్ షెడ్ పక్కనున్న వేప చెట్టు క్రింద చిన్న అరుగు మీద కూర్చుని ఉంటే ,అతనికి కొద్దిగా ఎడంగా ఒకతను కూర్చున్నాడు. తనూరో కాదు. పక్కూరుడే. అతను ఎవడి గురించో తన ఆవేశాన్ని ఎంకట్రెడ్డితో వెల్లగక్కుతున్నాడు. ఎంకట్రెడ్డి మౌనంగా వింటూ ఉన్నట్లుండి,

"ఇంతకు ఎవరోడు మన పార్టీ వాడేనా " అన్నాడు.

"కాదన్నా అవతల పార్టీ వోడు.మనకులపోడు కూడా కాదు. కాని ఆడుండేది అంతా వోడి కులపోళ్లే . మనం కులపోళ్లుండేది నాల్గు ఇల్లే . దాంట్లోను రెండు అవతల పార్టికి సపోర్టు సేస్తుండారు . ఆ రెండిళ్ల మనకులపోళ్ల అండ వోడి కులపోళ్ల అండ సూసుకొనే వాడట్ట విర్రవీగుతుండాడు. పొద్దున్న లేసిన కాడ్నించి వాడితో వాడి పెళ్లాంతో రధన ఐపోతుండాది . సేయిసేసుకొంటామనిపిస్తాది . కాని వోడి బలగాన్ని సూసి ఏమనలేక పోతుండా నువ్వే ఏదో ఒకటి సేయాల . " అన్నాడతను.

" అసలేంది గొడవ ఏం జరిగినాది మీ మద్దెన" అన్నాడు ఎంకట్రెడ్డి.

" ఏంలా వోడి ఇల్లు మా ఇల్లు పక్కన పక్కనేఉండాయి. వాడిదేమో పెంకుటిల్లు నాది మిద్దె. నా మిద్దెకు పక్కన ఖాళీ జాగాఉండాది. ఇంట్లో చిమ్మిన చెత్త, కసువు ఆంతా మిద్దెపైనుండి పక్కన కాళీజాగాలో వేయలని మా ఆడోళ్లు క్రిందికేస్తారు. అది ఒకోసారి గాలికి అంతో కొంత వోడి ఇంటి ముందర పడతాది. అట్టా ఏయద్దు క్రిందికి దిగొచ్చి ఎయాలంటడు. వోడు సెప్పినట్టు ఇనాల ఏంది. గాలికి వోడి ఇంటి ముందు పడితే తప్పు మాదా. మేమన్నా కావాలని ఏస్తాండమా సెత్త . దానికి కొట్లాట. ఇగ జల్దారి నీళ్లు గుంత నిండి ఎప్పుడో ఓ పారి వోడి ఇంటి ముందు కొద్దిగా సెమ్మైతాండాది. దానికి పెద్ద రగడ సేస్తరు. నేనుంటే పర్వాలా గాని నేను లేక పోతే ఈ ఆడోళ్లు రెచ్చిపోయి యాద గలాటా సేసి నెత్తిమీదికి తెచ్చుకొంటారో అనిపిస్తాంటాది. "అన్నాడు

తప్పెవరిదో రుద్రకు అర్థమయ్యింది.

రుద్రతో పాటు ఎంకట్రెడ్డికి అర్థమయ్యింది. ఎంకట్రెడ్డి మాట్లడక పోవడంతో ,

"వోడికి నాల్గిండ్లు ఎక్కువుండాయని రెచ్చిపోతుండాడు కొడుకు . నీకు సెప్పి నేనొకటి సేయాలనుకొంటుండా నా పొలం పక్కనే వోడికి నాల్గెకరాల కయ్య ఉండాది. వోడు ఆ పొలం లోకి పోవాలంటే నా పొలం ల్లోంచే పోవాల. ఎరువు ,గిరువు తోలుకోవాలన్న నా పొలంల్లోంచే తోలుకోవాల "

"అయితే "

"వోడు దారికి రావాలంటే వోడు పోయేదానికి లేకుండా కట్టడి సేయాలనుకొంటుండా . అప్పుడు గొడవ సేస్తడు వోడు . గొడవ జరిగినాక వోడికి సపోర్టు వచ్చినోళ్లందర్ని స్టేషన్లో లోపలేసి నాల్గు తన్నించే పని సేయాల . అప్పుడు వోడే నా దారికి వొస్తడు. నా జోలికి రాను బెయపడ్తడు. దానికి నువ్వు సపోర్టుగా ఉండాలా . ఆ సిఐకి చెప్పి వోళ్లకు కోటింగ్ ఇప్పించాల." అన్నాడు సుబ్బారెడ్డి తను వచ్చిన పనేమిటో పూర్తిగా చెప్తూ .

వాళ్ల మాటలు వింటూ రుద్ర మౌనంగా ఉండలేక పోయాడు.

" తప్పు నీది పెట్టుకొని ఎదుటోన్ని తప్పంటావా. మనం సేసే పని మనకే జరిగితే ఎట్టా ఉంటాదో అనుకొని ఆలోసించాలా . అట్టా మసలుకొవాలా. ఒకేలా నువ్వే ఆయన స్తానంలో ఏం సేసేవోడివి నీ ఇంటి ముందు చెత్త పడినా

, జల్దారి నీళ్లు పారినా గమ్మనుంటావా ".అన్నాడు. రుద్ర మాటలు సూటిగా తగులుతుంటే అతనికి నోట మాటరాలేదు అతనికి . అసహనంగా ఎంకట్రెడ్డి ముఖంలోకి చూసాడు అతనేం చెప్తాడో అని.

ఎంకట్రెడ్డి రుద్ర వైపు ఓ సారి చూసి . సుబ్బారెడ్డి వైపు తిరిగి " తప్పు కాదా సుబ్బారెడ్డి. అంత చిన్న దానికి గెలికి గెలికి పెద్దది సేయడమెందుకు. ఎట్టోళ్లను పిలిచి జల్దారి గుంతలో నీళ్లు తీసేయించు. ఇంట్లో ఆడోళ్లకు చెప్పి చెత్త పైనుంచి ఏయద్దని సెప్పు సరిపోయా. దీనికి అన్ని గొడవలు పోలీసు టేషన్లు సుట్టు తిరగడాలు అవసరమా. " అన్నాడు సుబ్బారెడ్డి భుజం మీద చేయి వేస్తూ. సుబ్బారెడ్డి ముఖం మాడ్చుకొన్నాడు. తను కులపోడు అని తనకు మైదుకూరులో పెద్ద బంధువర్గముందని తెలిసి కూడా , తన వద్దకు రాని ఎక్సపార్టివాడి సపోర్టు చేస్తున్న తండ్రి కొడుకుల్నిద్దర్ని చూసి ఏం మాట్లాడాలో తెలియక కొద్ది క్షణాలు మౌనంగా ఉండి అక్కడ తన పని జరగదని ,

" అది తెలీక కాదన్న నీకాడికి వచ్చినేది. అట్టాసేస్తే వోడికి భయపడినట్టే కాదా ఏంది " అన్నాడు అసహనంగా.

"ఇందులో భయపడిసేసేదేముంది సుబ్బారెడ్డి. ఒకడితో సెప్పించుకోకుండా మన పని మనం సేస్తాండామంతే. అట్టా సేసినా వోడు అట్టే రచ్చ సేసినాడనుకో అప్పుడు సూద్దాం వోడి కతేందో"

సుబ్బారెడ్డికి అక్కడ తన పని కాదనిపించింది. మరేమి మాట్లడకుండా వెళ్లిపోయాడు.

అతను వెళ్లిపోయాక రుద్రను "ఏం ఇట్టా వచ్చినవు. రా కూకో " అన్నాడు ఎంకట్రెడ్డి తన పక్కన చేయి చూపిస్తూ . అతని కళ్లు ఎర్రగా నిప్పుల్లాగా ఉన్నాయి. రాత్రి మందుఎక్కువై కాబోలు ముఖమంతా ఊదుకొని ఉంది. రుద్ర దగ్గరికి రాగానే రాత్రి కొట్టిన మందువాసన గుప్పుమంది. ఒకడుగు వెనక్కి వేసాడు రుద్ర. అది గమనించి "అరే దుబ్బోడా వేపపుల్ల పట్రారా" అని కేకేసాడు పొలం దున్నేవాడ్ని .వాడు తెచ్చిచ్చిన వేపపుల్ల నమిలి ఎంగిలి తుపుక్కున ఊస్తూ,రుద్రవైపు చూచాడు చెప్పమన్నట్లు. రుద్ర కదలక మెదలక నిల్చుని ఉండటంతో ,

"ఏం అట్టానే నిల్చున్నావ్ కూకో . ఊరికేమన్నా పోతుండావా డబ్బులేమనన్నా కావాలా లేక ఏదన్నా పనా"

రుద్ర ముందుకు వచ్చి అతని పక్కన కూర్చుంటుంటే ,"జనాలు ఎట్టా తయారైండ్రో సూడు. తప్పుసేసి కూడా ఎదుటోన్ని బెదిరించి తమ సెప్పు సేతల్లో పెట్టుకోవాలని సూస్తుండారు. సరెలే వోడి కతెందుకు గాని ఏందిట్టా వొచ్చినవు . మీ అమ్మకు తెలియకుండా ఏదన్నా సేయబోతుండావా ఏంది "

తన చేయబోయే పని ముందుగానే పసి గట్టిన తండ్రి వైపు చూస్తు "అట్టాంటిదే అనుకో"అంటు ఆఫీసులో జరిగింది చెప్పుకొచ్చాడు రుద్ర. అది వింటుండగానే అంత శాంతంగా ఉన్న ఎంకట్రెడ్డి ఒక్కసారిగా బగ్గుమన్నాడు.

ఎర్ర బడ్డ కళ్లలోంచి నిప్పులు కురిపిస్తూ " ఎంతదయిర్నంరా ఆ నాకొడుక్కు నీ మీదికే పోలీసుల్ను ఉసి గొలిపినేకి. ఇయ్యాలే వోడి కతేందో తేలుస్తా. ఎవడైంది కండ్లు కనపడలేదా వోడికి. " అంటూ ఉన్న చోటునుండి ఉన్నపళంగా పైకి లేచాడు. అతనికి అంతకోపం వస్తుందని ఊహించలేదు రుద్ర.

"లేదు నాయనా అతనికి నేనెవొరో తెలియదు నేను సెప్పలేదులే . అందుకే అట్టా సేసిండు. "అని శాంత పరిచాడు. ఎంకట్రెడ్డికి ఆవేశం తగ్గాక,

" నేనిప్పుడు వాళ్లట్టా సేసింర్రని సెప్పేదానికి రాలే . " ప్రశ్నార్థకంగా చూచాడు ఎంకట్రెడ్డి.

"మండలాఫీసు ఆఫీసులా లేదు. లంచాలు బాగా మరిగింర్రు. సన్నాసపక వోళ్లను ఖాతరు సేయడంలా. పనులు సేయకుండా తిప్పుకొంటుండారు. అది సూసినాక నేను వోళ్లను దారిలోకి తేవాలనుకొంటుండా. పనులు సేయని వోళ్లను నిలదీసి పనులు సేయించాలనుకొంటుండా..... "

సాలోచనగా చూచాడు ఎంకట్రెడ్డి. రుద్ర చెప్పే మాటలు వింటుంటే అతని మనసుకూడా రాజకీయల్లోకి మళ్లుతుందేమో అనిపించింది. గ్రామంలో చిన్నా చితక పనులు చేస్తుంటే పట్టించుకోలేదు . ఇప్పుడు రుద్ర మనసు గ్రామస్థాయినుండి మండల స్థాయికి పెరిగిందా ? అది రాజకీయలకది పునాది కాబోతుందా అనిపించింది.. అంతలోనే భార్య సావిత్రమ్మ గుర్తుకొచ్చింది.

". నీకెందుకురా ఇయన్ని . మీ అమ్మకు నచ్చవు. ఇప్పుడు ఆ సాఫ్టవేరు ఉద్యోగముండాది . అదిగాక రేపో మాపో పోలీసుద్యోగం రాబోతుండాది. ". అన్నాడు.

" సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఎట్టా ఇంటికాడా కూర్చోని అయినా సేయచ్చు. ఉద్యోగం వచ్చేదాకా ఖాలీగానే కద ఉండేది. ఆడ జరిగినేది సూసినాక నా కెందుకో మనసొప్పుకోవడంలా. పది మందికి సహాయం సేయాలనిపిస్తుండాది. "

ఎంకట్రెడ్డి ఆలోచనలో పడ్డాడు. రుద్ర చేసే పని తప్పుకాదనిపించి . పది మందికి మంచి జరిగే పని ఎందుకు వద్దనాల . మళ్లీ తన భార్య గుర్తుకొస్తుండగా ,

".మీ అమ్మ అడ్డం సెప్తాదేమోరా .ముందుగానే దానికి రాజకీయలంటే పడదు. నేను రాజకీయల్లో ఉండటమే దానికిష్టంలేదు. ".అన్నాడు.

" దీనికి రాజకీయాలకు సంబంధమేదుండాది. నేను అమ్మకు ఎట్టోగో ఒక్కట్ట నచ్చ చెప్తాలే నాయనా. " అన్నాడు రుద్ర.

".సరే అట్టాగే కాని ". అని ఎంకట్రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఎక్కడ అడ్డం చెప్తాడో ఎదురు తిరిగి ఎక్కడ చేయాల్సివస్తుందనుకొన్న రుద్ర స్థిమిత పడ్డాడు. ఎంకట్రెడ్డి పాలేరు దుబ్బోడ్ని పిలిచి వాడికేదో పని చెప్పి అలా ఇద్దరు మాట్లడుకొంటూ ఇంటికి పోయేందుకు అరుగు దిగి నడుస్తుంటే ఎంకట్రెడ్డికి తలంతా భారంగా అనిపించింది సాగింది . నిస్సత్తువుగా ఉండటంతో పాటు గుండెల్లో సన్నగా నొప్పిగా ఉన్నట్లన్పించింది. వళ్లంతా చెమటలు పట్టసాగాయి. నడుస్తుంటే నొప్పి మరింత ఎక్కువ కావడంతో నడిచేందుకు శక్తిలేనట్లు తూలి క్రిందపడపోయాడు. పక్కనే నడుస్తున్న రుద్ర కంగారు పడుతూ ". ఏమైనాది నాయనా ". అంటూ , ఎంకట్రెడ్డిని పడకుండా పట్టుకొన్నాడు. అదే సమయంలో పొలం దున్నుతున్న పాలేరు పరిగెత్తుకొంటూ వచ్చాడు. ఇద్దరు కలిసి పక్కన రాయి మీద కూర్చోపెట్టారు ఎంకట్రెడ్డిని. పాలేరు

తెచ్చిన నీళ్లు త్రాగించారు . కొద్దిగా మంచి నీళ్లు త్రాగాక ఉన్నట్లుండి పెద్దగా త్రేపు వచ్చింది. ఆ తర్వాత కొద్ది క్షణాలకు మామూలు మనిషి అయ్యాడు ఎంకట్రెడ్డి. తండ్రి పరిస్థితి చూసి ,

" ఏమైనాది ఇంతకు ముందు ఎప్పుడన్నా ఇట్టా అయినాదా "భయపడుతూ అడిగాడు రుద్ర.

"నాల్గుదినాల కింద ఇట్టా కాదు కాని నిస్సత్తువుగా గుండెల్లో మంటగా ఉండినాది. డాక్టరుకు సూపించిన భయపడాల్సిన పనిలే గ్యాస్టిక్ ప్రాబ్లమ్ వల్ల ఇట్టా ఉండొచ్చేమో అని మాత్రలు ఇచ్చిందు. బాగానే ఉండినాది ఇప్పుడే ఎందుకో చాతిలో నొప్పి వచ్చినాది కళ్లు తిరిగనట్లునిపించినాది. తేపు రాగానే నొప్పి తగ్గిపోయినాది. మందు తాగడం తగ్గించాలా రాత్రి కొద్దిగా ఎక్కువతాగినా అందుకే ఇట్టా అయినట్టుండాది " నీరసంగా అన్నాడు ఎంకట్రెడ్డి.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS